సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి ఆహ్వాన పత్రాలు అందజేస్తున్న ప్రజలు

పూజలు చేస్తున్న దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, ఫిబ్రవరి 23: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల సంక్షేమ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు ఆదివారం శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ రాజును కలిశారు. తమ తమ ప్రాంతాల్లోని సమస్యలను వివరించడం తోపాటు పరిష్కరించాలని కోరగా అందుకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

- కుత్బుల్లాపూర్ దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని 6 నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. అంబేద్కర్‌కు నిత్య పూలమాల కార్యక్రమం 300 రోజులకు చేరుకున్నది. మార్చి 1న సూరారంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలంటూ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ రాజును కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. పలు శుభ కార్యాల్లో పాల్గొనాలని పలువురు ఎమ్మెల్సీ రాజుకు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

- దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్‌లోని హనుమాన్ ఆలయం ప్రాంగణంలో ఆదివారం జరిగిన శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని, పూజలు చేశారు.

శివలింగ ప్రతిష్ఠాపన

దుండిగల్,ఫిబ్రవరి 23: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గాగిల్లాపూర్ లోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. వేడుకలకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్యఅతిథిగా విచ్చేయగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. వారు ఆలయంలో పూజలు నిర్వహించారు. వేడుకల్లో దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్అ ధ్యక్షులు సంజీవరెడ్డి, గోపాల్ రెడ్డి, కుంటి నాగరాజ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్ : ఫీడర్ మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ఏఈ దీప్తి తెలిపారు. 11 కె.వి. మార్తాండ నగర్ ఫీడర్ పరిధిలోని మార్తాండ నగర్, న్యూ హఫీజ్ పేట్, హనీఫ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కె.వి. ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలోని ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయక నగర్, ప్రకాష్ నగర్ వంటి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నేడు ప్రజావాణి నిర్వహించనున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ అధికారులు తెలిపారు. నేడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని.. జోనల్ కమిషనర్, అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. కూకట్‌పల్లి మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని డీసీలు గంగాధర్, వంశీకృష్ణ తెలిపారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ –రూపాయలు) ఈ విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 20, కాకర 35, బీర 35, క్యాబేజీ10, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 18, కాలీఫ్లవర్ 18, దొండ 40, చిక్కుడు 40, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 18, క్యాప్సికం 35, ఆలుగడ్డ 21, కీరా 18, దోసకాయ 23, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 35, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడి 20, నిమ్మకాయలు(12) 40 నుంచి 50, మునగకాయ(1) 8 నుంచి 10, పచ్చి బఠానీ 35, పొప్పడి కాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 180, అల్లం 80, వెల్లుల్లి 160, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9 : 30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

అలరించిన భరతనాట్యప్రదర్శన

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. ఆదివారం బెంగళూరుకు చెందిన సుముఖశ్రీ కళా కుటీర కళాకారులు అశ్విని సుకీర్తి బృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. తం తం తం మూషిక వాహన, రారా వేణు, సరసిజాక్షులు, దరు వర్ణం, శ్రీరాజరాజేశ్వరి, జావళి, చంద్రచూడా, నవరస రామాయణ అంశాలను అశ్విని సుకీర్తి, స్వాతి, పూజిత, రక్షిత, మోనిక, సుదీప్తి, వర్ష, కీర్తన, వైభవి ప్రదర్శించారు.

అన్నమయ్య నృసింహ సంకీర్తనార్చన

యాదగిరిగుట్ట ఆలయంలో సంకీర్తనలు ఆలపిస్తున్న పద్మశ్రీ శోభరాజు

మాదాపూర్, ఫిబ్రవరి 23: పద్మశ్రీ డా. శోభరాజు అన్నమయ్య నృసింహ సంకీర్తనలు ఆలపించారు. ఆదివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బంగారు విమానం గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశ్రీ డా.శోభరాజు శిష్య బృందంతో కలిసి అన్నమయ్య విరచిత నృసింహ సంకీర్తనలు నమామ్యహం మానవసింహం, అంబుజాక్ష నమో, రావమ్మా మహాలక్ష్మి, విష్ణుడొక్కడే విశ్వాత్మకుడు వంటి అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. గాత్రసహకారం అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థులు సాందీప్, చైత్ర, సాయి రన్విత్తా, సహస్ర, అభిరామ్ కీబోర్డ్ రాజేశ్వరరావు, తబలా బి. వి. రమణ మూర్తి, డ్రమ్స్ అరుణ్ వాద్యసహకారం అందించారు. శోభారాజును ఆలయ ప్రముఖులు సన్మానించారు.

అగ్నికి ఆహూతైన ప్రైవేట్‌బస్సు

ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బస్సు

దుండిగల్, ఫిబ్రవరి 23: బస్సు బాడీ పరిశ్రమ పార్కింగ్ ప్లేస్‌లో ఓ ప్రైవేటు బస్సు అగ్నికి ఆహూతైంది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా..? కావాలనే ఎవరైనా చేశారా..అనేది మిస్టరీ. లక్షల రూపాయల విలువచేసే బస్సు ఆహుతైతే ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం పోలీస్ స్టేషన్ పరిధి, సూరారం కట్టమైసమ్మ ఆలయం సమీపంలోని ఎస్ ఎస్ మోటార్స్కు చెందిన ఖాళీ స్థలంలో ఆదివారం మధ్యాహ్నం ఫోర్స్ కంపెనీకి చెందిన కొత్త బస్సులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు 100 డయల్ చేయగా జీడిమెట్ల ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదంటున్నారు. ఎస్ ఎస్ మోటార్స్ చెందిన ఖాళీ ప్రదేశంలో ప్రమాదం చోటు చేసుకోగా ఎలా జరిగిందనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. బస్సు పార్కింగ్ చేసిన పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ఉండడంతో ఎవరైనా అటువైపుగా వెళ్లి సిగరెట్ తాగి పడేసి ఉంటారా..? లేక ఎండ వేడికి ఇంజన్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం జరిగిందా అనేది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ఎస్ ఎస్ మోటార్స్ కంపెనీలో బస్సులకు గ్లాస్ ఫిట్టింగ్,ఏసీలు వంటి అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేస్తారని స్థానికులు పేర్కొంటున్నారు. ఆదివారం కొత్త బస్సు సైతం ఏసీ ఫిట్టింగ్ కోసం ఇక్కడికి వచ్చి ఉంటుందని పేర్కొంటున్నారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

బాలానగర్, ఫిబ్రవరి 23 : విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని బాలానగర్ మండల విద్యాశాఖ అధికారి హరిచంద్ర పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో ఆప్సా పరివాహన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే సైన్స్ పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు సైన్స్ విభాగంలో పట్టుదలతో ముందుకు సాగి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ్ జ్యోతి, ఆప్సా బృందం సభ్యులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి.. ప్రాణదాతలవ్వండి

జగద్గిరిగుట్ట : తోటివారి ప్రాణాలు నిలిపేలా రక్తదానం చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్ లో ఆదివారం ఆయుష్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తూ అవగాహన కల్పించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలతో పాటు హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు స్థానిక నాయకులుతలు పాల్గొన్నారు.

గాయత్రి బ్రాహ్మణ అసోసియేషన్ పరిచయ వేదిక

వివాహ పరిచయవేదిక కార్యక్రమానికి హాజరైన పలువురు సభ్యులు

మాదాపూర్ : మియాపూర్‌లో గాయత్రి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం ప్రతినిధి పి.ఆర్.కె.మూర్తి విచ్చేశారు. కార్యక్రమంలో 800 మంది పాల్గొనగా 25 మందికి వివాహం కుదిరినట్లు తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ 160 వరకు జరిగిందని, హాజరైన వారికి భోజన వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం సంఘం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సోమయాజులు, పి.ఎస్. శంకర్, రాఘవ, రాంబాబు, మహిళా విభాగం సభ్యులు, రత్నకుమారి, విజయలక్ష్మి, రమాదేవి, కమలమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

న్యూ రామారావు నగర్ అభివృద్ధికి కృషి

అల్లాపూర్ : న్యూ రామారావు నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ సబీహా బేగం అన్నారు. న్యూరామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో రామ్‌రెడ్డి విజయం సాధించాడు. రామ్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సత్తాచాటిన వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ

మాదాపూర్ : వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన 2వ ఓపెన్ నేషనల్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ – 2025 టోర్నమెంట్‌లో విద్యార్థులు సత్తా చాటారు. అఖిల్, గోవర్ధన్, అర్జున్ ప్రథమ, నర్మద ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు డబ్ల్యూఎంఏఏ ఫౌండర్, చీఫ్ ఎగ్జామినర్, కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ రిఫరీ, కోచ్ ఎన్. పోచయ్య మెడల్స్ అందజేశారు. వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ లక్ష్మణ్ విద్యార్థులను అభినందించారు.

తెలుగు భాషకు ప్రాధాన్యత ఉన్నది

మాట్లాడుతున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ మంజుల

సుల్తాన్ బజార్ : దేశభాషలందు తెలుగు లెస్స అని కవులు, రచయితలు, తెలుగు భాష ప్రాధాన్యతను ప్రపంచ పటంలో నిలిపారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆవుల మంజుల అన్నారు. ఆదివారం చాదర్‌ఘాట్‌లోని భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల రీ యూనియన్ పేరిట పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె డాక్టర్ పద్మావతి, డాక్టర్ వెంకటరమణ డి.మధుబిందు భాగ్య మెమోరియల్ గర్ల్స్‌హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ శ్రీలత గౌతమ్, ప్రిన్సిపాల్ రత్న మేరీ లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేటితరం విద్యార్థులు పాశ్చాత్య పోకడలకు పోకుండా తెలుగు ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. భాగ్య మెమోరియల్ బాలిక ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 2024 వరకు విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులను, నాలుగో తరగతి సిబ్బందిని శాలువా, జ్ఞాపికల తో సన్మానించారు. పూర్వ విద్యార్థినులు పాఠశాలలో తాము చదువుకున్న సమయంలో తరగతి గదులను సందర్శించి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

రహదారిపై బోరువేసే యత్నం..

జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 23 : రోడ్డుపై బోరు వేసేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ సంజయ్‌గాంధీ నగర్‌లో రోడ్డు నం. 8 లో ఓ వ్యక్తి తన ఇంటి ఎదురుగా ఆదివారం బోరు వేస్తున్నాడు. ఇంటికి మూడు అడుగుల ముందు రోడ్డుపైనే బోర్ తవ్విస్తున్నాడు. స్థానికులు స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పనులు నిలిపివేయించి యంత్రాన్ని పంపించి వేశారు. డివిజన్లో చాలా చోట్ల ఇంటి బాల్కనీ బయటకు నిర్మించడం బోర్లు రహదారిపై వేయడం పరిపాటిగా మారిందని పలువురు వాపోయారు. ఇదే బస్తీ రోడ్ నం.7 లోని రోడ్డు మీద బోర్ వేశారు. ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

నృత్యకళ లో ప్రోత్సహించాలి

విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం జాతీయ స్థాయి క్లాసికల్ డ్యాన్స్, మ్యూజిక్ కార్యక్రమం జరిగింది. నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించిన నటిమణులు రాగిణి, జ్యోతి రెడ్డి, హెల్త్ ఫిట్‌నెస్ మోటివేటర్ అనుప్రసాద్, అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవి తదితరులు.

– తెలుగు యూనివర్సిటీ

జనావాసాల మధ్య ఓయోరూమ్‌ను తొలగించాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 23: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఓయోరూమ్‌ను తొలగించాలని కోరుతూ ఆదివారం నాగారం మున్సిపాలిటీ లోని రాంపల్లి గ్రామం, షిర్డీ సాయి కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. గా కాలనీ వాసులు మాట్లాడుతూ షిర్డీ సాయి కాలనీలో ఇటీవల ఓయో రూమ్‌ను కొందరు ఏర్పాటు చేయడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండటం తో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నివాసాల మధ్య ఓయో రూమ్ ఉండటంతో ఈ రోడ్డు మార్గం గుండానే ప్రధానదారి కి వెళ్లే మహిళలు ,చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఓయో రూమ్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు.మున్సిపల్,పోలీస్ అధికారులకు ఓయో రూమ్‌పై ఫిర్యా దు చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో షిర్డీసాయి కాలనీ ప్రెసిడెంట్ నరేశ్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

కీసర : సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 24వ తేదీ నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 11గంటలకు ఆలయంలో పూజతో ప్రారంభిస్తారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యా ర్థం క్యూ లైన్లు, బారికేడ్లను ఏర్పాటు చే శారు. ధర్మ దర్శనం, వీఐపీ, వీవీఐపీ క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, కార్యనిర్వాహణాధికారి కట్టా సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఆన్‌లైన్‌లో దర్శనం టిక్కెట్లు

25వ తేదీ స్వామివార్ల కల్యాణం, 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినానికి సంబంధించి ఆన్‌లైన్‌లో కీసరగుట్ట వెబ్ సైట్‌లో టికెట్లు తీసుకొనే వెసులుబాటును కల్పించామని ఆలయ చైర్మన్ నారాయణశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి తెలిపారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తులకు అన్నదానం

మహాశివరాత్రి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కీసర సహకార సంఘం చైర్మన్, రెడ్డి సంఘం నాయకులు రామి డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. 24, 25, 26, 27వ తేదీల్లో రెడ్డి సంఘం భవనం వద్ద కీసరగుట్టకు విచ్చేసే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. రెడ్డి సంఘం సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కాప్రా: కీసరగుట్టలో జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ సోమవారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు కుషాయిగూడ డిపో మేనేజర్ బి.మహేశ్ కుమార్ తెలిపారు. అఫ్జల్‌గంజ్, తార్నాక, లాలాపేట్, మౌలాలి హౌసింగ్ బోర్డ్, ఈసీఐఎల్, కుషాయిగూడ మీదుగా నడుపుతున్నట్టు తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ఈసీఐఎల్, కీసర బస్‌స్టాండ్ వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్టు డీఎం వివరించారు. 26వ తేదీన శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే కల్యాణానికి విచ్చేయు భక్తులకు టీఎస్ఆర్టీసీ కుషాయిగూడ డిపో ఏర్పాట్లు చేసిందని, టీఎస్ ఆర్టీసీ బస్సులన్నీకీసరగుట్ట బస్‌స్టాండ్ వరకు అంటే గుడిప్రాంగణానికి అతి దగ్గరకు ప్రయాణికులను చేరవేస్తాయని, దర్శనం అయిన తర్వాత బస్‌స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికులకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేసినట్టు డీఎం తెలిపారు. కీసర గుట్టవెళ్లే భక్తులు, సురక్షితంగా టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని డిపో మేనేజర్ బి.మహేశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వక్తలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత విద్య వ్యవస్థలు ప్రైవేటు యాజమాన్యం ఆధీనంలోకి వెళ్లిపోయాయని, ప్రభుత్వ ఆధీనంలో 50 శాతంగా ఉన్న ప్రాథమిక, మాధ్యమిక విద్యలో మౌలిక వసతులు, విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ప్రైవేట్ బాటపడుతున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోషియేషన్ విమర్శించింది. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమాన విద్యా అవకాశాలు, నాణ్యమైన నైపుణ్యమైన విద్యకోసం డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డీఆటీఏ) ఆవిర్భావం సందర్భంగా పలువురు వక్తలు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాసు మారేడు, ప్రొఫెసర్ మొహీనోద్దీన్, ఉపేందర్, డా.రజిత, మల్లేశ్, నరేందర్, ప్రొఫెసర్ శోభ, గణేశ్ విచ్చేసి ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ప్రధానంగా ఇంజినీరింగ్ విద్య మొత్తానికి ప్రైవేట్ యాజమాన్యం లోనే కొనసాగుతుందన్నారు. పుట్టగొడుగుల్లా వెలిసిన ఇంజినీరింగ్ కాలేజీలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. యూజీసీ, ఏఐసీటీఈ, ఎఫ్‌సీఆర్‌సీ లాంటి సంస్థలు విధించిన నియమ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడలేదని విమర్శించారు.

అర్హతలున్న బోధన సిబ్బంది లేదు..

అన్ని అర్హతలు ఉన్న బోధన సిబ్బందిని ఇంజినీరింగ్ కళాశాలలు నియమించుకోకపోవడంలేదని, సిబ్బందికి సరైన జీతాలు చెల్లించడంలేదన్నారు. విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తూ లాభార్జనే ధ్యేయంగా నడుపిస్తున్నారని విమర్శించారు.నాణ్యమైన విద్యసాధించడం కోసం డిమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ అనే సంస్థను ఏర్పాటు చేస్తున్నామని, ప్రైమరీ టీచర్స్ నుంచి యూనివర్సిటీ టీచర్ వరకు అందరూ ఈ సంస్థలో సభ్యులుగా చేరి విద్యారంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొంటూ.విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలని నాణ్యమైన విద్య కోసం దాతా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహ్మద్ మొహీనుద్దీన్, డా.సీతారాములు, ఎంఎన్ నర్సయ్య, డా.ఉపేందర్‌కుమార్ పాల్గొన్నారు.